క్లుప్తంగా

'అన్నదాత పోరు'కు తరలిరండి


అప్పారావు

కొయ్యూరు: రైతుల సమస్యలపై వైఎస్సార్‌సీపీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుమేరకు పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం పాడేరులో నిర్వహిస్తున్న ఆందోళనకు వైఎస్సార్‌సీపీ పార్టీ నేతలు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ శ్రేణులంతా తరలిరావాలని మండల పార్టీ అధ్యక్షుడు బి.అప్పారావు కోరారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులను నిలువునా మోసం చేసిందన్నారు. రైతులకు ఎరువులు లేకుండా వేధిస్తోందన్నారు. ఈ ధర్నాలో పార్టీ నాయకులు, అభిమానులు, ప్రజలు పాల్గొనాలని ఆయన కోరారు.

వీవోఏల మండల కమిటీ నూతన కార్యవర్గం


ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

జి.మాడుగుల: మండల వీవోఏల నూతన కమిటీ ఎన్నిక మండల కేంద్రంలోని రామాలయం ప్రాంగణంలో ఆదివారం జరిగింది. మండల సీఐటియు కో-కన్వీనర్ వెలుగు వీఆర్వోఏ సంఘం గౌరవ అధ్యక్షుడు వి.మహేష్ ఆధ్వర్యంలో వీవోఏ యూనియన్ ఎన్నికలు నిర్వహించారు. మండల వెలుగు వీవోఏల ఉద్యోగుల సంఘం అధ్యక్షులుగా అండం గిసింగి(వీవోఏ) ఎస్.మత్స్యలింగం, కార్యదర్శిగా దేవినాయుడు, సహాయ కార్యదర్శిగా లక్ష్మణ్, కోశాధికారి జి.సింహాచలం, యూనియన్ సలహాదారులుగా రమణమూర్తి, క్లస్టర్ బాధ్యులుగా బాలన్న, కాశీపుష్ప, ధర్మ, దావీద్, పద్మ మరో ఏడుగురు సభ్యులు, ఆడిటర్లుగా సర, సుధ, రత్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సీఐటీయూ నాయకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గులాబి మొక్కలకు గుడ్లు


గురుకులం కళాశాలలో గులాబీ మొక్కలకు విద్యార్థులు తగిలించిన ఖాళీ గుడ్లు

జి.మాడుగుల: గులాబి మొక్కలకు గుడ్లు పూసినట్టుగా కనిపించడం స్థానికుల్లో ఆసక్తి కలిగించింది. మొక్కలకు గుడ్లు ఉండటమేటని దగ్గరు వెళ్లి పరిశీలిస్తే అప్పుడు తెలిసింది. పూలు లేని కొమ్ములకు ఖాళీ గుడ్లను అమర్చినట్టు. మండల కేంద్రంలో గురుకుల కళాశాల ఆవరణలో గులాబీ మొక్కలకు ఖాళీ గుడ్లను అందంగా కన్పించటానికి విద్యార్థులు తగిలించారు. గులాబి మొక్కలకు ఖాళీ గుడ్లు ఉన్న దృశ్యాలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి.

వైభవంగా ఊంజల్ సేవ


ఊంజల సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

అనకాపల్లి: స్థానిక దేవునిగుమ్మం వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం రాత్రి అత్యంత వైభవంగా స్వామివారి ఊంజల్ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్చకులు రాజేష్, ప్రసాద్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బొలిశెట్టి శ్రీనివాసరావు, మద్దాల కృష్ణారావు, అమరపల్లి కృష్ణాజీ, కసిరెడ్డి సూరిబాబు, దాసరి రామకృష్ణ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

అనంతరం గవరపాలెం వాగ్దేయ వరదాయిని వ్యవస్థాపకుడు తిమ్మాపాత్రుని చక్రవర్తి ఆధ్వర్యంలో అన్నమాచార్య కీర్తనలు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలి

అనకాపల్లి: స్త్రీ శక్తి పథకంలో భాగంగా రాష్ట్రంలో మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన మాదిరిగా దివ్యాంగులకు అమలు చేసేవిధంగా కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు పాత్రపల్లి వీరుయాదవ్ కోరారు. స్థానిక ఉడ్‌పేట సంఘం కార్యాలయంలో జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ సహకారంతో దివ్యాంగులైన మాటూరు ఏసుదాసు, బానోద్ దిలీప్‌లకు ట్రై సైకిల్, వీల్ చైర్ ఆదివారం ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సదరం సర్టిఫికెట్ ఆధారంగా రాష్ట్రంలో దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి మొల్లి చంద్రశేఖర్, సభ్యుడు చెట్టుపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నిలువ నీడ కరువు

- శిథిలావస్థలో బస్ షెల్టర్లు
- ప్రయాణికుల అవస్థలు
- రోడ్లపై, చెట్ల నీడల్లోనే పడిగాపులు
- నూతన బస్‌షెల్టర్లు మంజూరు చేయాలని వినతి


కుజభంగి జంక్షన్‌లో చెట్టు నీడలో నిరీక్షిస్తున్న ప్రయాణికులు


కుజభంగి బస్ షెల్టర్ దుస్థితి

ముంచంగిపుట్టు: అసలే మన్య ప్రాంతం ఎప్పుడు ఎండ కాస్తుందో.. ఎప్పుడు వర్షం పడుతుందో తెలియని పరిస్థితి. దీనికి తోడు ఆర్టీసి బస్సులు సమయపాలన లేకపోవడం బస్సుల కోసం వేచి చూసే ప్రయాణికులు నిలువనీడ కరువై నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముంచంగిపుట్టు మండలంలో బస్ షెల్టర్‌లు పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ముంచంగిపుట్టు నుంచి డుడుమ, జోలాపుట్టు, కుమడ, కుజబంగి మార్గాల వైపు నిత్యం ఆర్టీసీ బస్సులు తిరుగుతుంటాయి. అయితే ఈ మార్గంలో ఉన్న బస్ షెల్టర్లు రేకులు పగిలిపోయి శ్లాబులు పెచ్చులూడిపోయి ఏ క్షణం కూలిపోతాయో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో బస్‌షెల్టర్‌లో ప్రయాణికులు నిరీక్షించకుండా సమీపంలోని చెట్ల నీడల్లో, దుకాణాల వద్ద, రోడ్లపైనే బస్సుల కోసం గంటల కొద్దీ నిరీక్షిస్తున్నారు. మండలంలో కుజబంగి బస్ షెల్టర్ శ్లాబ్ పూర్తిగా కారి పాతుండడంతో ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. పనసపుట్టు బస్ షెల్టర్ పూర్తిగా నెలమట్టమైంది. చోటముఖీపుట్టు బస్ షెల్టర్ పై రేకు బీటలు వారి కారిపోతుంది. సంగడ బస్ షెల్టర్ పైకప్పు ఎగిరిపోయి నిరుపయోగంగా మారింది. జోలాపుట్టు బస్ షెల్టర్ శిథిలావస్థకు చేరుకుని అధ్వానంగా మారింది. లబ్బూరు బస్ షెల్టర్ కూలిపోయింది. ఈ బస్ షెల్టర్లన్నీ 25 ఏళ్ల కిందట నిర్మించినవి కావడం వీటికి మరమ్మతులు చేసినా వినియోగంలోకి తేలేని పరిస్థితి ఏర్పడింది. అధికారులు శిథిలమైన బస్ షెల్టర్లు ప్రదేశాల్లో నూతన బస్ షెల్టర్లు మంజూరు చేస్తే తప్ప ప్రయాణికుల సమస్యలు తీరవు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆయా మార్గాల్లో నూతన బస్ షెల్టర్లు మంజూరు చేసి నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.


చోటముఖీపుట్టులో శిథిలావస్థలో బస్ షెల్టర్



బస్‌షెల్టర్ లేక ఏలేశ్వరం మార్గంలో షాపు వద్ద వేచి ఉన్న ప్రయాణికులు

ఉన్నతాధికారులకు తెలియజేశాం



ముంచంగిపుట్టు మండలంలో జోలాపుట్టు, కుజభంగి, కిలగాడ, కర్రిముఖిపుట్టు గ్రామాల వద్ద బస్ షెల్టర్ల సమస్యను ప్రయాణికులు తమ దృష్టికి తీసుకువచ్చారు. బసు షెల్టర్లు పరిస్థితులను ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడం జరిగింది. నిధులు మంజూరైన వెంటనే బసు షెల్టర్లు మరమ్మతులు, నూతన నిర్మాణాల పనులు మొదలుపెడతాం.

– సూర్యనారాయణమూర్తి, ఎంపీడీవో, ముంచంగిపుట్టు

కష్టాలు వర్ణనాతీతం



ఎండకి, వానకి బస్సుల కోసం రోడ్లపై నిరీక్షించేందుకు నిత్యం ఇబ్బందులు పడుతున్నాం. రోడ్లపై గంటల కొద్దీ వేచి ఉండేందుకు కష్టంగా ఉంది. వృద్ధులు, దివ్యాంగులు, బాలింతలు నిరీక్షణ కష్టాలు వర్ణనాతీతం. అధికారుల దృష్టికి బస్ షెల్టర్ల సమస్యను తీసుకువెళ్లినా స్పందన లేదు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది.

– జి.రాంబాబు, ప్రయాణికుడు, ముంచంగిపుట్టు

ఆరుబయటే నిరీక్షణ

కొయ్యూరు: మూడు రోడ్లతో ప్రధాన కూడలి(జంక్షన్)గా ఉన్న కాకరపాడులో బస్ షెల్టర్ల నిర్మాణాన్ని జాతీయ రహదారుల నిర్మాణ సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) విస్మరించింది. దీంతో ప్రయాణికులు ఆరుబయటే బస్సుల కోసం నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొంది. మూడు ప్రాంతాలకు వెళ్లేందుకు వచ్చిన ప్రయాణికులు ఏదో ఒక చోట తలదాచుకోవలసి వస్తుంది. వర్షం కురిస్తే వారి పరిస్థితి దయనీయంగా మారుతోంది. ఇటు కొయ్యూరు వచ్చేందుకు, అటు ఏలేశ్వరం వెళ్లేందుకు, మరోవైపు నర్సీపట్నం వెళ్లేందుకు మూడు దారులతో కాకరపాడు కూటలి కీలకంగా ఉంటుంది. ఇక్కడ మూడు వైపులా బస్ షెల్టర్లను నిర్మాణం చేయాల్సి ఉంది. బస్‌షెల్టర్లు లేక చిన్నారులు, వృద్ధులు ఆరుబయటే నిరీక్షించాల్సి వస్తోందని, తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ ప్రాంతంలో బస్‌షెల్టర్ నిర్మించాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

బస్‌షెల్టర్లు నిర్మించాలి



ముంచంగిపుట్టు నుంచి జోలాపుట్టు, డుడుమ, కుమడ, కుజభంగి మార్గాల్లో బసు షెల్టర్లు పాడైపోయాయి. నిత్యం ఆయా మార్గాల్లో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ప్రధాన ప్రదేశాల్లో నూతన బసుషెల్టర్లు నిర్మించాలి. శిథిలావస్థలో ఉన్న బసు షెల్టర్లును బాగు చేసి వినియోగంలోకి తీసుకురావాలి. గతంలో అనేకసార్లు అధికారులకు బస్ షెల్టర్లు సమస్యను తెలియజేశాం.వెంటనే ప్రయాణికుల ఇబ్బందులు గమనించి, బసు షెల్టర్లు వల్ల కలిగే ఇబ్బందులు తొలగించాలి.

– ఎస్.భాగ్యవతి, వైస్ ఎంపీపీ, ముంచంగిపుట్టు

శ్రమదానంతో రహదారికి మరమ్మతులు

ఎటపాక: ఎవరో వస్తారు..ఏదో చేస్తారు అని ఎదురు చూడలేదు. నిత్యం నడిచే రహదారి అధ్వానండా ఉండడంతో స్థానికులే స్వచ్ఛందంగా రహదారికి మరమ్మతులు చేసుకున్న ఘటన ఆదివారం గుండాల కాలనీలో జరిగింది. ప్రధాన రహదారి గోతుల మయంగా మారి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. సమస్యను తాత్కాలికంగా పరిష్కరించుకునేందుకు గ్రామంలోని హనుమాన్ జంక్షన్ యువత స్పందించింది. వారంతా గోతులను గ్రావెల్‌తో పూడ్చేందుకు ఏకమయ్యారు. ట్రాక్టర్లను తీసుకెళ్లి గ్రావెల్‌ను తవ్వి తెచ్చి గోతుల్లో పోసి చదును చేశారు. ఈ రహదారి సమస్యపై పలుమార్లు అధికారులకు మొరపెట్టుకున్నా స్పందించకపోవడంతో తామంతా శ్రమదానం చేసి గోతులు పూడ్చుకున్నామన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రహదారి నిర్మించాలని కోరుతున్నారు. యువత స్పందనకు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.


రహదారిపై గోతులను గ్రావెల్‌తో పూడ్చుతున్న యువత

ముగ్గురు వైద్యుల బదిలీ

చింతపల్లి: చింతపల్లి ఏరియా ఆస్పత్రి నుంచి ముగ్గురు వైద్యాధికారులకు మైదాన ప్రాంతాలకు బదిలీ అయ్యింది. చింతపల్లి ఏరియా ఆస్పత్రిలో రెండేన్నరేళ్లుగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ఇందిరా ప్రియాంకను డిప్యూటీ సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా విజయనగరం చీపురుపల్లికి బదిలీ చేశారు.

అదే విధంగా గడిచిన ఆరు నెలలుగా సివిల్ అసిస్టెంట్ క్యాడర్‌లో విధులు నిర్వహిస్తున్న సంతోష్‌కుమార్‌ను స్పెషలిస్టుగా పదోన్నతి కల్పిస్తూ బదిలీ చేశారు.

రెండేళ్లుగా సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా విధులు నిర్వహిస్తున్న రెడ్డి భారతిని అనకాపల్లి జిల్లా కోటవురట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి బదిలీ చేశారు. బదిలీపై వెళ్లిన ముగ్గురు వైద్యులు శనివారం రిలీవ్ కాగా వారి స్థానంలో ఇంకా ఎవ్వరిని నియమించలేదు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

గంగవరం : ఏజెన్సీ ప్రాంతానికి చెందిన ఇరువురు ఉపాధ్యాయులకు పాన్ ఇండియా అవార్డులు దక్కాయి. రాజమండ్రిలో పాన్ ఇండియా సోషియో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో ఏజెన్సీ ప్రాంతానికి చెందిన రాజవొమ్మంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ జూనియర్ కళాశాల తెలుగు ఉపాధ్యాయులు తీగల బొజ్జయ్య, ఎల్లవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు సారపు చినబాబు దొర సేవలను గుర్తించి వారిని సన్మానించి, ప్రశంసాపత్రాలు అందజేశారు. పాన్ ఇండియా సోషియో అసోసియేషన్ వ్యవస్థాపకుడు అద్దంకి రాజా యోన ఈ అవార్డులకు ఎంపిక చేశారని ఏజెన్సీ డిఇఒ వై.మల్లేశ్వరరావు తెలిపారు. గత 12 సంవత్సరాలుగా డ్రాప్ ఔట్ విద్యార్థులకు వయోజన సార్వత్రిక విద్య ద్వారా పరీక్షలు నిర్వహించి విద్యావంతులుగా తయారుచేసి, ప్రస్తుతం ఈ విద్య ద్వారా ఎంతోమంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ఉపాధ్యాయులు కృషి చేశారని ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు చెప్పారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బి.గోపి మూర్తి , మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ కుమార్, కాకినాడ స్పెషల్ కలెక్టర్ సత్యనారాయణ చేతుల మీదుగా వీరు అవార్డులు అందుకున్నారు. అవార్డుగ్రహీతులకు ప్రముఖులు, ఉపాధ్యాయులు తదితరులు అభినందనలు తెలిపారు.


బొజ్జయ్య, చినబాబు, డీఈవో మల్లేశ్వరరావును సన్మానిస్తున్న మాజీ ఎంపీ అరుణకుమార్, ఎమ్మెల్సీ గోపి , గోపిమూర్తి తదితరులు

ముంచెత్తిన భారీ వర్షం


గొట్లుపాడు కాలువ ఉధృతంగా ప్రవాహంతో ద్విచక్ర వాహనదారుల కష్టాలు


రాజేంద్రపాలెంలో కురుస్తున్న వర్షం

కొయ్యూరు: భారీ వర్షాల మూలంగా కాలువలు ఉధృతంగ ప్రవహిస్తున్నాయి. దీంతో ఎక్కుక గ్రామాలుకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. శనివారం రాత్రి కురిసిన వర్షానికి గొట్లుపాడు కాలువ ఆదివారం ఉధృతంగా ప్రవహించడంతో దాదాపు 12 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అత్యవసరమైన వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. యూ.చీడిపాలెంలో ఆస్పత్రికి లేదా ఆశ్రమ పాఠశాలకు వెళ్లాలన్నా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ కాలువపై వంతెన నిర్మించాలని పలుమార్లు అధికారులకు కోరుతున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. దీంతో వర్షాకాలం మూడు నెలలు ప్రజలు నరకం చూస్తున్నారు. వర్షానికి కొయ్యూరు సంత బోసిపోయింది.రోడ్లపై నుంచి వరదనీరు ప్రవహించింది.

సమస్యల పరిష్కారానికి కృషి

ముంచంగిపుట్టు: లబ్బూరు ఏకలవ్య పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కారిస్తామని ఏపీఎస్‌ఆర్‌టీసీ విజయనగరం జోన్ చైర్మన్ సియ్యారి దొన్నుదొర అన్నారు. మండలంలోని జోలాపుట్టు పంచాయతీ లబ్బూరు గ్రామంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను ఆయన ఆదివారం తనిఖీ చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ సుమన్‌తో మాట్లాడి పాఠశాలలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అసంపూర్తిగా ఉన్న భవనాలను పరిశీలించారు.విద్యార్థులకు అందిస్తున్న భోజనాల నాణ్యతను పరిశీలించి. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పాఠశాలలో తాగునీటి సమస్య ఉందని, వర్షం కురిసినపుడు కొన్ని గదుల్లోకి నీరు చేరుతుందని, వసతి సమస్య ఉందని, నేలపై పడుకుంటున్నామని, మోటార్ పనిచేయక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు తమ సమస్యలను దొన్నుదొరకు తెలిపారు. ఉన్నతాధికారులతో మాట్లాడి దశల వారీగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. నాయకులు సన్యాసమ్మ తదితరులు పాల్గొన్నారు.


దొన్నుదొరకు సమస్యలు తెలియజేస్తున్న ఏకలవ్య పాఠశాల విద్యార్థులు

పాఠశాల ఇలా... చదువులు ఎలా ?

- ఈదురుగాలులకు కూలిన భవనం పైకప్పు రేకులు
- వర్షం కురిస్తే గదులన్నీ జలమయం
- చర్చిలో తరగతులు
- విద్యార్థుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు


పైకప్పు రేకులు ఎగిరిపోయిన గొర్రెలమెట్ట పాఠశాల భవనం వద్ద విద్యార్థులు

కొయ్యూరు: సరస్వతి నిలయం పూర్తిగా పాడైపోవడంతో ప్రార్థన మందిరంలో బోధన చేయాల్సిన దుస్థితి నెలకొంది. మండంలోని బూదరాళ్ల పంచాయతీ గొర్రెలమెట్ట పాఠశాల భవనం పూర్తిగా పాడైంది. గతంలో భారీ వర్షాలకు వీచిన ఈదురుగాలులకు భవనం పైకప్పు రేకులు ఎగిరిపోయాయి. దీంతో విద్యార్థులకు బోధన చేసేందుకు అవకాశం లేకపోయింది. గత్యంతరం లేక సమీపంలో ఉన్న చర్చిలో తరగతులు కొనసాగిస్తున్నారు. అదే పంచాయతీలో చీడిపల్లి పాఠశాల పరిస్థితి అలానే ఉంది. ఇక్కడ కూడా వర్షం కురిస్తే పాఠశాలకు సెలవు ఇవ్వాల్సి వస్తుంది. దాదాపుగా ఎనిమిది వరకు పాఠశాల భవనాలు పూర్తిగా పాడైపోయాయి. దీంతో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. వాటికి సంబంధించి ఎంఈవో ఉన్నతాదికారులకు నివేదించారు.అయినా నిధులు విడుదల కాలేదు. ఇలా భవనాలు లేని పాఠశాలలు మండలంలో 20 వరకు ఉన్నాయి.

నాడు ఘనం.. నేడు అధ్వానం

పాఠశాలల దుస్థితిపై కూటమి ప్రభుత్వం కనీసం పట్టించుకోవడం లేదని గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో విద్యా వ్యవస్థ బాగు పడిందని చెబుతున్నారు. నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సర్కారు బడులకు మోక్షం కలిగిందని, నాడు-నేడు ద్వారా పాఠశాలల మరమ్మతులు, నూతన భవనాల నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులు విడుదల చేసిందని, దీంతో మన్యంలో దశాబ్దాల తరబడి మరమ్మతుకు నోచుకోని భవనాలకు మహర్దశ కలిగిందని గుర్తు చేస్తున్నారు. ఎన్నడూ లేని విధంగా పాఠశాలల రూపురేఖలు మారాయని చెబుతున్నారు. మన్యంలోని పాఠశాలలన్నింటిని బాగు చేసేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో దశలవారీగా నిధులు మంజూరయ్యాయి.అయితే ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచిపోయాయంటున్నారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాదైనా మన్యంలో ఒక్క పాఠశాలకు మరమ్మతు చేయించిన దాఖలాలు లేవని, గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో కూడా బడులకు ఎటువంటి పనులు చేయించడం లేదని చెబుతున్నారు. విద్యా వ్యవస్థ నాడు ఘనంగా ఉండేదని, నేడు కూటమి ప్రభుత్వ పాలనలో అధ్వానంగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

శిథిల భవనాలు.. ఆందోళనలో తల్లిదండ్రులు

మన్యంలో చాలా ప్రభుత్వ పాఠశాలలు శిథిలభవనాల్లో కొనసాగుతున్నాయి. బీటలు వారిన గోడలు, పెచ్చులూడుతున్న శ్లాబులతో తమ పిల్లలు భయపడుతున్నారని, దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలు ప్రాంతాల్లో భవనాల చెంతనే ఆరుబయట తరగతులు జరుగుతున్నాయని, కొన్నిచోట్ల గ్రామస్తులు అరుగులపై బోధన జరుగుతుందని చెబుతున్నారు. చాలా పాఠశాలల్లో సమస్యలు వేధిస్తున్నాయని , తాగునీరు, మరుగుదొడ్లు, వసతి సమస్యతో విద్యార్థులు అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులకు సరిపడే విధంగా ఉపాధ్యాయులు లేరని, కొన్ని చోట్ల ఉపాధ్యాయులు లేరని చెబుతున్నారు. తమ పిల్లల భవిష్యత్తు ప్రశార్థకంగా మారిందని ఆందోళన చెందుతున్నారు. పాఠశాలల దుస్థితిపై పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదంటున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, ఉన్నతాధికారులు పట్టించుకోని పాఠశాలల సమస్యలు పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

పీఏసీఎస్ ఆకస్మిక తనిఖీ

రోలుగుంట: నర్సీపట్నం ఆర్డీవో వి.వి.రమణ ఆదివారం స్థానిక పీఏసీఎస్‌ను తకస్మిక తనిఖీ చేశారు. రైతులకు సిబ్బంది ఎరువులు సరఫరా చేస్తున్న తీరును పరిశీలించారు. గోదాంలో ఎరువుల రకాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సీఈవో మహేష్‌కు ఎరువుల విక్రయాలపై పలు సూచనలు చేశారు. స్టాకు ఉన్నంత మేరకు రైతులకు అందుబాటులో ఉండి ఎరువులు అందించాలని ఆదేశించారు. తహసీల్దార్ ఎస్. నాగమ్మ పాల్గొన్నారు.

ఘనంగా పసలమారమ్మ పండగ


ఘటాలతో ఊరేగింపు

మునగపాక: పసలమారమ్మ పండగ ఆదివారం మునగపాకలో ఘనంగా జరిగింది. ఇక్కడ అయిదు మదుంల జంక్షన్ దరి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. అమ్మవారి ఘటాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు, వార్డు సభ్యులు పెంటకోట సత్యనారాయణతోపాటు పసలమారమ్మ మూల సంఘ రైతులు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

వెంకన్న ఆలయానికి విరాళం


విరాళం అందజేస్తున్న భక్తులు

మునగపాక: స్థానిక బైపాస్ రోడ్డులో నిర్మిస్తున్న కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి ఆలయానికి భక్తులు తమవంతు సాయం అందజేస్తున్నారు. రూ.5 కోట్లతో ఆలయ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఆదివారం మునగపాకలోని శ్రీ సిటీ లే-అవుట్ నిర్వాహకులు ఎంబీవీకే నాయుడు, బాబ్జినాయుడు రూ.లక్ష విరాళం అందజేశారు. ఆలయ చైర్మన్ ప్రసాద్, జగ్గారావు, కృష్ణ, శ్రీనివాసరావు, గోపి, సూర్యనారాయణ, శివ తదితరులు పాల్గొన్నారు.

గురుదేవుల ఆశ్రమంలో పౌర్ణమి పూజలు


పూజలు చేస్తున్న భక్తులు

నర్సీపట్నం : మున్సిపాలిటీ ఉత్తరవాహిని నదీతీరంలో వెలసిన శ్రీపాకలపాడు గురువుగారి ఆశ్రమంలో ఆదివారం పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. పౌర్ణమి పూజలు ఆచరించడం ద్వారా దోష నివారణ కలుగుతుందని భక్తుల విశ్వాసం. దీంతో ప్రతి పౌర్ణమి పూజలకు నర్సీపట్నం పరిసర ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజల్లో పాల్గొంటారు. వందల మంది భక్తులు పౌర్ణమి పూజలు ఆచరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆశ్రమ కమిటీ అధ్యక్షుడు రమణ మాస్టర్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.